# యమపాశం

ఆర్కాటు వెంకటరమణ



"మంత్రి వర్యా! చిత్రగుప్తా" పిలిచాడు యమధర్మరాజు. జవాబు లేదు.

"చిత్రగుప్తా!" రెట్టించిన స్వరంతో పిలిచాడు.

క్షణం నిశ్శబ్దం. జవాబు లేదు.

"చిత్రగుప్తా! ఏమీ నీ అహంకారం? సహించజాల" అంటూ హుంకరించాడు ధర్మరాజు.

మౌనంగా నిలబడ్డాడు! బదులివ్వలేదు!

"ఏమి గుప్తా! ఏమయినది మీకు! ఈనాడు ఎందులకు అలా మౌనంగా నిలబడ్డారు. మీ సమస్య లేమైనా ఉంటే తెలియ జేయవచ్చుకదా"

'ప్రభూ! నేను ఇహ ఈ ఉద్యోగం చేయలేను!'

"కారణం?"

'దయచేసి నన్ను మన్నించండి.'

"లేదు! మిమ్మల్ని వదులు కోలేను!...."

"లేదు ప్రభూ! నన్ను వత్తిడి చేయకండి."

"అసలు మీకొచ్చిన సమస్య లేమిటి?"

"ఏం చెప్పమంటారు ప్రభూ! నా నోటితో చెప్పలేను."

'మీరు... మీరేనా ఇలా మాట్లాడేది!? ఈ యమపురిలో మా తరువాత మా అంతటి వారు మీరు! మీరేమిటి ఇలా డీలా పడడం! ఈ వైరాగ్యం! చాలా ఆశ్చర్యముగా ఉన్నది. మీ ఆజ్ఞ ఎవ్వరైనా ధిక్కరించారా... చెప్పండి.... లేక ఎవరైనా పాపులు ఎదురు తిరిగి సమాధానాలు చెప్తున్నారా?..... లేక మీ స్వంత సమస్యలా... ఏమిటి చెప్పండి... మీ సమస్య మా సమస్యగా భావించి ఎంత కష్టమైనా తీరుస్తాను'అంటూ అనునయంగా అడిగాడు యమపురాధీశుడు.

ఎంత అనునయంగా మాట్లా డినా చిత్రగుప్తుడిలో చలనం లేదు. ముఖంలో కళాకాంతులు లోపిం చాయి. మ్లానవదనుడై ఉన్నాడు.

"మంత్రివర్యా! మీ ముఖంలో ఏదో తీవ్రమయిన అలజడికి లోనయిన భావన కానవచ్చుచున్నది. మీ చిత్త క్షోభ ఏమిటో అర్థం కావట్లేదు! సాధారణ మానవులవలె మీరు కూడా స్పందించుటయా! మీ మ్లాన వదనం మమ్మల్ని విచలితుల్ని చేస్తుంది! కర్తవ్య విమూఢులై ఉన్నాము. సరే! ఈ రోజుకు సభ చాలిద్దాం! మీకు పూర్తి విశ్రాంతి అవసరం. మిగిలిన కార్యక్రమాలు రేపు చూద్దాం వెళ్లిరండి" అంటూ సభ చాలించి వామ హస్తమందు యమపాశాన్ని బట్టి గదాధరుడై తన అంతఃపురానికి వెడలినాడు.

మందిరం చేరిన చిత్రగుప్తుల వారు అన్యమనస్కంగానే కాలం గడిపారు! దేవేరితో సరస సల్లాప ములు లేవు. హాయి గొలిపే నాట్య విన్యాసములు లేవు. సుమధుర మదిరా సేవనాలు బంద్!

★ ★ ★

మరుసటి దినమున

"మంత్రివర్యా! కుశలమా! ఉల్లాసవంతులే కదా!" అంటూ ప్రశ్నించాడు యమధర్మరాజు.

"ప్రభూ!"

"ఇంకనూ మీ మనమున విషాద ఛాయలు గోచరించు చున్నవి!... మీ....."

"ప్రభూ! నన్నేమి అడగవద్దు! తమరు దయ ఉంచి, నన్ను కరుణించి, ఈ ఉద్యోగ బాధ్యతల నుంచి తప్పించి నన్ను విముక్తుణ్ణి చేయండి."

"జాలం! తప్పించజాలం! మీ కన్నా సమర్థులు ఎవరున్నారు? కృత, త్రేతా, ద్వాపర యుగాల్నించీ అత్యంత సమర్థంగా, అనితర సాధ్యంగా పాపుల చిట్టాలను నిర్వహిస్తున్న మిమ్ములను పదవీ బాధ్యతల నుంచి విముక్తులను చేయడమా...! హు...! అందులకు సమ్మతించ జాల! అది కాని పని! ఒక వేళ మీ మనస్సునకు కష్టం కలిగించే సంఘటన ఏమైనా అవలో కించారా! చెప్పండి! ఆ వైరాగ్యంతో నేనా ఇలా మాట్లాడుతున్నారు?"

"ప్రభూ! తమరు దయ ఉంచి నన్నేమీ అడక్కండి."

"లేదు! చెప్పి తీరాలి!"

"ప్రభూ! మన్నించండి."

"చిత్రగుప్తా! యమలోక రాజ్యాధీశులమయిన మేము మిమ్ములను ఇదే ఆజ్ఞాపించుచున్నాము! తక్షణం మీ మనసులోని అలజడి, సంతాప నికి, వైరాగ్యానికి కల కారణం తెలియజేయాలి!'

"ప్రభూ!"

"తప్పదు."

"ప్రభూ! మీరింత బలవంతం చేస్తున్నారు కాబట్టి చెపుతున్నా వినండి! ఇంత కాలం మీ యమపాశం లేనిదే మానవుల ప్రాణాలు తియ్యడం సాధ్యమయ్యేది కాదు! కాని... ఇప్పుడు... కాని..."

"చెప్పండి."

"ఏమి చెప్పమంటారు ప్రభూ! మీ యమపాశం శక్తి సన్నగిల్లినట్లుంది. లేకపోతే ఏమి చెప్పమంటారు ప్రభూ, రోజు రోజుకూ పెరిగిపోతున్న మగ పుంగవుల దౌష్ట్యం! తమను నమ్మి వచ్చిన పడతులను నిర్దాక్షిణ్యంగా అగ్నికి ఆహుతి చేస్తున్నారు! కిరోసిన్ పోసి కాల్చేస్తున్నారు! ఆ స్త్రీల ఆక్రందన వింటుంటే నా హృదయం ద్రవించుకుపోతోంది. దీనికి అంతు లేదా మహారాజా! ఒకరు కాదు, ఇద్దరు కాదు రోజుకు కొన్ని వందల మంది అభాగ్య అబలలు ఇలా కాల్చి చంప బడుతున్నారు. ఆ మగ పుంగవుల దౌర్జన్యం, పడతుల ఆక్రోశం భరించ లేకపోతున్నా ప్రభూ! ఇంత కాలము మన యమపురికి ఏదేని యుద్ధమో లేక భూకంపమో లేదా ప్రబలమైన వ్యాధి ప్రబలినప్పుడు కాని కొన్ని వందల మంది పాపులు వచ్చేవారు. కానీ ఇప్పుడు రోజూ ఇవే చావులు. ఏమీ ప్రభూ! ఈ అన్యాయం!... గత మూడు యుగాలుగా ధర్మం మీరు చెప్పినట్లే నడిచేది!... నడు స్తుండేది... కాని ఇప్పుడు మీ ధర్మం పని చేయడం లేదు. కలియుగ మహాత్యం. కట్టుకొన్న భార్యలను కడతేర్చే యములు (కొందరు) తయారయ్యారు! అగ్నిసాక్షిగా పాణి గ్రహణం చేస్తారు! అగ్నిసాక్షిగానే భార్యలను బూడిద చేస్తున్నారు! ఆ అమాయక అబలల ఆక్రందన వినలేకపోతున్నా! అలా బలి అయిన అబలలు ప్రతి దినము యమలోక ముంగిట వాలుతుంటే వారిని చూసి నా హృదయం ద్రవించుకుపోతోంది. అసహాయులు, నిర్భాగ్యులైన ఆ అబలల 'పాప పుణ్య' చిట్టా చూడడం నా వల్ల కాదు. నిండుగా నూరేళ్లు పిల్లా పాపలతో కలకల నవ్వుతూ కాలం గడపాల్సిన ఆ పడతులకు ఇదేం శిక్ష?.. అసలు మీ యమపాశం మీ చేతుల్లో ఉందా... లేక యుగ ధర్మానుసారం దాని శక్తి సన్న గిల్లిందా?"

"చిత్రగుప్తా!" ఫీంకరించాడు అరివీర భయంకరంగా యమ ధర్మరాజు.


"అవును ప్రభూ!.... ఎక్కడుంది ప్రభూ మీ యమపాశం? ఎక్కడుంది ధర్మం! ఆ దిక్కులేని అభాగ్యుల అర్ధాంతర మరణాలు చూస్తుంటే.. వాళ్ళ గోలుగోలున మన లోకం ముంగిట్లో విలపిస్తుంటే, వాళ్ల పాప పుణ్యాల చిట్టా చూడలేకపోతున్నాను ప్రభూ!... మీ యమపాశం మీ చేతుల్లో లేదు...."

"ఆ!"

అవును మహారాజా! 'యమ పాశం' ఉంది మీ చేతుల్లోనే! కాని అది కేవలం హస్త భూషణం... అసలయిన యమపాశం ఈ రోజు దురాశా పీడితులయిన కొందరు మానవాధముల చేతుల్లోకి వెళ్లి పోయింది. ధర్మం పని చేయడం లేదు. మీ ఆజ్ఞ మీ యమపాశం వినటం లేదు. ధర్మాధర్మ విచక్షణ లేదు. న్యాయాన్యాయ ప్రసక్తి లేదు. పూర్ణాయుష్కులు అల్పాయుష్కులై పోతున్నారు. అర్ధాంతరంగా చంప బడుతున్నారు. ఈ స్త్రీ సంహారానికి అంతులేదా! నిర్భాగ్యులైన నారీ లోకాన్ని చూస్తుంటే ఈ పదవికి నేను తగననిపిస్తోంది.

అర్ధాంతరంగా మృత్యువు వాత పడుతున్న ఆ పడతుల అరణ్యరోదన, మీ యమపాశం నిర్వీర్యత, న న్నీ పదవీ పరిత్యాగానికి పురి కొల్పాయి. దయచేసి నన్ను మన్నించండి. మీతో చాలా కాలానికి ఇలా మాట్లాడవలసి వచ్చింది. నన్ను పదవి బాధ్యతల నుంచి తప్పించండి! లేదా ఆ దేవ దేవునికి మొరపెట్టుకొంటా మీరు నన్ను విముక్తిణ్ణి చేయకపోతే!"

"ఆ!' నిర్ఘాంతపోవటం యమ ధర్మరాజు వంతయింది. ●



**భర్తృహరి**

ఒక ఇన్స్యూరెన్స్ ఏజెంట్ పల్లెటూరి రైతును పాలసీ తీసుకోమని నచ్చ చెపుతూ-

"ఓ వేళ నీవు అకస్మాత్తుగా చనిపోతే... అప్పుడు నీ భార్య పరిస్థితి ఏంటి?" అన్నాడు.

"అది తర్వాత సంగతి. ముందు నా భార్య చనిపోతే నా పరిస్థితేం కావాలి. అదాలోచించుకోనీయండి నన్ను" అన్నాడు భార్య మీద ఆధారపడి బతుకు వెళ్లదీస్తున్న ఆ భర్తృహరి.

- దండా ఓంకారీశ్వర్ (బాపట్ల)